



ఉప్పలపాడు స్టాక్‌పాయింట్‌లో ఉచిత ఇసుక లోడింగ్

పడకేసిన పర్యాటకం..





నిరుపయోగంగా ఉన్న హరిత టూరిజం రెస్టారెంట్ భవనం





వీరాపురం వద్ద నిరుపయోగంగా ఏపీ టూరిజం రెస్టారెంట్

- గత ప్రభుత్వంలో పర్యాటకాభివృద్ధి శూన్యం
- అతిథి పక్షులకు వసతులు కరువు
- తిండి, ఆవాసం లేక విలవిల
- శిథిలావస్థలో ప్రభుత్వ రెస్టారెంట్లు

చిలమత్తూరు, జూలై 9: గత వైసీపీ పాలనలో పర్యాటకం పడకేసింది. పర్యాటకాభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లేపాక్షి, వీరాపురం ప్రపంచ పటంలో చోటు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. గత టీడీపీ హయాంలో ఇవన్నీ అభివృద్ధి వైపు అడుగులు పడ్డాయి. ఆ తరువాత వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కింది. దీంతో సైబీరియన్ వలస పక్షుల విడిది కేంద్రంగా ఉన్న మండలంలోని వీరాపురం పర్యాటక ప్రభను కోల్పోయింది. పర్యాటక ప్రదేశంగా ప్రపంచ పటంలో ఈ కుగ్రామం చోటు దక్కించుకుంది. దానిని కాపాడుకోవాల్సిన గత పాలకులు అడుగడుగునా నిర్లక్ష్యం చేశారు. దాంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యాటక కేంద్రంగా పేరొందిన వీరాపురం ప్రతిష్ట మసకబారింది. వేల కిలోమీటర్ల దూరం నుంచి వీరాపురానికి సైబీరియన్ పక్షులు అతిథులుగా వస్తాయి. అరుదైన పక్షులు కావడంతో వీటిని వీక్షించడానికి పర్యాటకులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు. వందల ఏళ్ల నుంచి పక్షులు సైబీరియా నుంచి వచ్చి ఈ గ్రామంలో విడిది చేస్తుండటంతో వీరాపురాన్ని ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా గుర్తించింది. అలాంటి గ్రామ అభివృద్ధిని గత వైసీపీ పాలకులు పూర్తిగా విస్మరించారు. కనీసం ఈ ప్రాంతంలో నిర్మించిన పర్యాటకు అతిథి గృహాలను కూడా పట్టించుకోలేదు. దీంతో అవి మూతపడ్డాయి. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

వలస పక్షులకు తిండి కష్టాలు

వేల కిలో మీటర్ల దూరం నుంచి వలస వచ్చే సైబీరియన్ పక్షులకు కనీసం కడుపు నిండా ఆహారం ఇవ్వలేకపోయారు. ఏటా జనవరిలో వలస పక్షులు వీరాపురం చేరుకుంటాయి. జూలై చివరి వరకు అక్కడే ఉండి సంతతిని అభివృద్ధి చేసుకుని, తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతాయి. ఈ విడిది కాలంలో పక్షులు ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. గత ఐదేళ్లలో పక్షుల కోసం ఒక్క పనిచేసిన దాఖలాల్లేవు. గతంలో పక్షులకు ఆహార సమస్య రాకుండా నీటి తొట్టెలు ఏర్పాటుచేసి, వాటిలో చేపలు పెంచేశారు. గత వైసీపీ హయాంలో పక్షుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. సైబీరియన్ వలస పక్షులు విడిదికి వీరాపురం, వెంకటాపురం గ్రామాలను ఎంచుకున్నాయి. ఈ రెండు గ్రామాల్లో తప్ప.. మరెక్కడా ఉండలేవు. ఈ గ్రామాల్లో పక్షులు విడిది చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. మొదట వీరాపురం గ్రామంలో విడిది చేసేవి. అక్కడ చెట్లు నేలకూలుతుండటంతో కొన్నేళ్లుగా పక్కనే ఉన్న వెంకటాపురానికి మకాం మార్చాయి. నేలకూలుతున్న చెట్ల స్థానంలో కొత్తవి నాటకపోవడంతో అతిథి పక్షులకు కష్టాలు తప్పడం లేదు.

పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

పక్షులను వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కరువయ్యాయి. పక్షులు విడిది చేసే ఆరు నెలల కాలంలో ప్రత్యేక బస్సులు నడపడం లేదు. గ్రామానికి వచ్చే పర్యాటకుల కోసం ఆహారం ఇతరత్రా వసతులను ఏర్పాటు చేయట్లేదు. పక్షులను వీక్షించడానికి వీలుగా టవర్లు ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు అమలుకు నోచుకోలేదు. దీంతో ఎత్తైన చెట్లలో ఉన్న పక్షులను చూడటానికి పర్యాటకులు నానా తంటాలు పడాల్సి వస్తోంది.

శిథాలావస్థలో టూరిజం భవనాలు

2005లో అప్పడి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో పర్యాటకుల సౌకర్యార్థం హరిత టూరిజం రెస్టారెంట్‌ను అన్ని హంగులతో నిర్మించింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు రెస్టారెంట్‌లో సేదతీరేవారు. రెస్టారెంట్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతోపాటు పరోక్షంగా స్థానికులకు ఉపాధి దక్కింది. కొన్నేళ్లపాటు లాభాలబాటలో సాగిన ఈ రెస్టారెంట్‌ను తర్వాత నష్టాలు వస్తున్నాయంటూ ప్రైవేటు పరం చేశారు. వారు పూర్తిగా నిర్వీర్యం చేసి, చేతులెత్తేయడంతో రెస్టారెంట్ మూతపడింది. దీంతో కోట్ల విలువచేసే భవనం శిథిలావస్థకు చేరుకుంది. పచ్చని చెట్లతో కళకళలాడిన భవన ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గత వైసీపీ పాలకులు.. రెస్టారెంట్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతానికి ఐకాన్‌గా నిలిచిన ఏపీ హరిత టూరిజం రెస్టారెంట్‌కి పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో స్థానికుల్లో ఆశలు చిగురించాయి. మండలంలోని వీరాపురం గ్రామ సమీపంలో నిర్మించిన మరో రెస్టారెంట్ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వాటిని వినియోగించకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.



రెస్టారెంట్లను వినియోగంలోకి తీసుకురావాలి

పర్యాటకుల సౌకర్యార్థం నిర్మించిన రెస్టారెంట్లు వైసీపీ హయాంలో మూలనపడ్డాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి, వీరాపురం గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. మూతపడిన రెస్టారెంట్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

- సూర్యనారాయణ, కోడూరు తోపు, చిలమత్తూరు మండలం



వీరాపురాన్ని అభివృద్ధి చేయాలి

పర్యాటక గ్రామంగా వీరాపురం దేశవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కింది. గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహించింది. దాంతో సౌకర్యాల్లేక అతిథి పక్షులు, వాటిని వీక్షించడానికి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. వీరాపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

-రంగప్ప, సోమఘట్ట, చిలమత్తూరు మండలం

అందుబాటులోకి ఇసుక..

స్టాక్‌పాయింట్ల నుంచి సరఫరా ప్రారంభం

పుట్టపర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో ఐదేళ్ల సామాన్యులకు ఇసుక అందకుండా పోయింది. టన్ను ఇసుక కొనాలన్నా వేలకు వేల రూపాయలు చెల్లించాల్సిన దుస్థితి కల్పించారు. నాడు ఇసుక అక్రమ రవాణా చేస్తూ వైసీపీ నాయకులంతా రూ.కోట్లకు పడగలెత్తారు. సాధారణ ప్రజలు కొనడానికి వీలులేకుండా చేశారు. టన్ను ఇసుక రూ.475 చొప్పున విక్రయించారు. ఊరూపేరూలేని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టి వారి పేరిట ముఖ్యనేతలే నేరుగా ఇసుక వ్యాపారం చేసి, రూ.వందల కోట్లు పోగేసుకున్నారు. ఇసుక అమ్మకాల్లో ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో వసూలు చేశారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.5వేలు, లారీ లోడు కావాలంటే రూ.30 వేలదాకా దోపిడీ చేశారు. ఆకాశంలో ఉన్న ఇసుక ధరను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చింది. నామమాత్రపు ధరతో ఇసుకను సరఫరా చేస్తోంది. జిల్లాలో ఐదు ఇసుక స్టాక్‌పాయింట్ల వద్ద 61,300 మెట్రిక్ టన్నుల ఇసుకను అదుబాటులో ఉంచింది. సోమవారం నుంచి జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక సరఫరాను లాంచనంగా ప్రారంభించారు. తొలిరోజు బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి, కదిరిలో కుటాగుళ్ల ప్రారంభం కాగా.. మంగళవారం ఉప్పలపాడు, కొడవండ్లపల్లిలో మొదలు పెట్టారు. నల్లబోయినపల్లి ఇసుక స్టాక్‌పాయింట్ నుంచి మంగళవారం సాయంత్రానికి 1582 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేశారు. ఉప్పలపాడు, కుటాగుళ్ల, కొడవండ్లపల్లి స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా రాష్ట్రప్రభుత్వం నామమాత్రపు ధరతో హ్యాండ్లింగ్ చార్జీలు కలిపి టన్నుకు రూ.277తో సరఫరా చేస్తోంది. ఆన్‌లైన్ చెల్లింపులను అమలు చేస్తోంది. స్టాక్ పాయింట్ల వద్ద క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్టాక్ పాయింట్లలోనే కాకుండా ఉపనదులు, వాగులు, వంకల నుంచి ఎడ్లబండ్లపై ఇసుక తరలించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావడంతో నిర్మాణ రంగంపై ఆధార పడ్డ కార్మిక కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

దారి చూపాకే.. హైవే పనులు చేపట్టాలి

రైతుల డిమాండ్... గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల అడ్డగింత

నల్లమాడ, జూలై 9: తమ పొలాలకు దారి చూపాకే రహదారి నిర్మాణం చేపట్టాలని మండలంలోని కుటాలపల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ సమీపాన చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులను మంగళవారం వారు అడ్డుకున్నారు. అక్కడే రెండుగంటపాటు బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ.. ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంతో తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతుందన్నారు. రోడ్డుకిరువైపులా 350 ఎకరాల భూములున్నాయన్నారు. వాటికి దారి చూపించి పనులు చేసుకోవాలన్నారు. పనులు చేయిస్తున్న మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి రైతుల వద్దకు చేరుకుని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు



మాట్లాడుతున్న శెట్టిపి జయచంద్రారెడ్డి

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి

ధర్మవరం, జూలై 9: మున్సిపల్ టీచర్లను సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సమస్య, అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు పోస్టుల మంజూరు, బదిలీలు, ప్రమోషన్లు, జీఓ నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రామకృష్ణనాయక్, పట్టణ అధ్యక్షప్రధానకార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే సరుకులు

రేపట్నుంచి పంపిణీ: డీఎస్ఓ

పుట్టపర్తి, జూలై 9: నిత్యావసర సరుకులను తక్కువ ధరకే పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) వంశీకృష్ణారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరిపట్టణాల్లో ఈనెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపడతామన్నారు. కందిపప్పు కిలో రూ.160, సోనామసూరీ బియ్యం కేజీ రూ.49కే విక్రయిస్తామన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగ సంఘం నేతపై

అక్రమ కేసులు ఎత్తేయాలి

సంఘం నేతల డిమాండ్

పుట్టపర్తి, జూలై 9: ప్రభుత్వోద్యోగుల సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్వో కొండయ్యకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేసిన తమ నేతపై అక్రమ కేసులు పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఉన్న మొత్తం కేసులను ఉపసంహరించుకోవాలని డీఆర్వోను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వెంకటనారాయణరెడ్డి, నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యోగసంఘం నాయకులు

వచ్చేస్తాం..!


అధికార పార్టీ వైపు వైసీపీ కౌన్సిలర్ల చూపు

పురంలో మారుతున్న సమీకరణాలు

చైర్మన్ పీఠం టీడీపీ వశం కానుందా?



హిందూపురం, జూలై 9: రాష్ట్రంలో అధికార మార్పిడితో స్థానిక సంస్థల పీఠాలు కదులుతున్నాయి. అధికార పార్టీలోకి చేరేందుకు వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు సుముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పురం మున్సిపల్ చైర్మన్ పీఠం కూడా కదులుతుందన్న చర్చ జోరుగా సాగుతోంది. పట్టణంలో ఏ ఇద్దరు కలిసినా దీనిపైనే చర్చించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాత హిందూపురం అతిపెద్ద పట్టణం. ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నది నందమూరి బాలకృష్ణ కావడంతో వైసీపీ కౌన్సిలర్లు కూడా పార్టీ మారి సైకిల్ ఎక్కడానికి తహతహలాడుతున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైసీపీ నుంచి 30మంది, టీడీపీ 6, బీజేపీ, ఎంఐఎం ఒకరు చొప్పున ఎన్నికయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంఐఎం కౌన్సిలర్‌తోపాటు వైసీపీ సభ్యులు ఇద్దరు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 9కి చేరింది. ఎలాగూ బీజేపీ సభ్యుడు టీడీపీ వైపే ఉంటారు కాబట్టి మొత్తం బలం 10కి చేరింది. చైర్మన్ మార్పు జరగాలంటే మరో పదిమంది కౌన్సిలర్లు అవసరం. వైసీపీ సభ్యులు 15మంది టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.



టీడీపీ వైపు చూపు

వైసీపీకి చెందిన సభ్యులు ఇంకా 28 మంది ఉన్నారు. ఆ పార్టీ నుంచి 10నుంచి 15మంది సభ్యులను మాత్రమే చేర్చుకునేందుకు టీడీపీ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడని వారిని మాత్రమే తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా కౌన్సిలర్లకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అవినీతికి పాల్పడిన, అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిని పార్టీలోకి చేర్చుకోకూడదని నిర్ణయించినట్లు టీడీపీ ముఖ్య నాయకుడొకరు తెలిపారు. దీంతో పదిమంది సభ్యులైనా ప్రభుత్వానికి చెడ్డపేరు తేకుండా పనిచేసేవారిని తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 20మందికిపైగా వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ ముఖ్య నాయకుల టచ్‌లో ఉన్నట్లు చర్చ సాగుతోంది.



చైర్మన్ పీఠం కోసం పోటీ

వైసీపీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు.. టీడీపీలో చేరితే ఆ పార్టీకి సంబంధించిన చైర్మన్ స్థానం కోల్పోనుంది. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల వరకు చైర్మన్‌ను మార్చడానికి వీలులేదు. ఆ పార్టీకి చెందిన మెజార్టీ సభ్యులు పార్టీ ఫిరాయిస్తే చైర్మన్ స్థానం ఎలాగూ కోల్పోయే అవకాశం ఉంది. ఒకవేళ చైర్మన్ రాజీనామా చేయకపోయినా అవిశ్వాసం పెడితే ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత చైర్‌పర్సన్ తప్పుకునే అవకాశాలు మెండుగా ఉన్నట్లు వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చైర్మన్ స్థానానికి టీడీపీలో పోటీ పెరిగింది. గతంలో చైర్మన్ కావాలని ఖర్చు పెట్టుకున్న నాయకుడితోపాటు పాలకవర్గంలో ఉన్న ముగ్గురు, నలుగురు సభ్యులు పోటీలో ఉన్నట్లు టీడీపీ వర్గాల ద్వారా తెలుస్తోంది. వీరిలో ఆర్థికంగా బలమున్న వ్యక్తి ఒక్కరే. మరో ఇద్దరు ఆశిస్తున్నా.. వారు కౌన్సిలర్లుగా లేరు కాబట్టి అవకాశం ఉండదన్న వాదనలు వినిపిస్తున్నాయి. చైర్మన్ కావాలంటే ఏదైనా వార్డు నుంచి కౌన్సిలర్‌ను రాజీనామా చేయించి, వారు బరిలోదిగి గెలిచి చైర్మన్ కావాల్సి ఉంటుంది. దీంతో కొంత ఖర్చు, కష్టంతో కూడుకున్న పని కాబట్టి పాలకవర్గంలో ఉన్నవారిద్దరు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. బాలయ్య ఆశీస్సులున్న వారే చైర్మన్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

బాలయ్య పర్యటనతో మారనున్న ముఖచిత్రం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 11, 12 తేదీల్లో హిందూపురంలో పర్యటించనున్నారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీలోకి చేర్చుకునే అంశంతో పాటు మున్సిపల్ చైర్మన్ మార్పిడిపై సమాలోచన చేసే అవకాశం మెండుగా ఉంది. వైసీపీకి చెందిన కౌన్సిలర్లు నెలరోజులుగా టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ నాయకులతో మంతనాలు సాగిస్తున్నా.. నిర్ణయాలు తీసుకోవాల్సింది ఎమ్మెల్యే. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారోనని టీడీపీ నాయకులు, వైసీపీ కౌన్సిలర్లు, చైర్మన్ స్థానం ఆశిస్తున్న వారు వేచి చూస్తున్నారు. బాలకృష్ణ పర్యటన సందర్భంగా ఆయా వార్డులకు చెందిన టీడీపీ నాయకులతో చర్చించి, వారిని ఒప్పించాకే వైసీపీ కౌన్సిలర్లను చేర్చుకునేందుకు ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేయవచ్చని తెలుస్తోంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, జూలై 9: సైబర్ నేరాలు ఇటీవలిగా అధికమయ్యాయనీ, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక డీపీలో పోలీసు అధికారులతో కలసి ఎస్పీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్, ట్రేడింగ్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకుఖాతా వివరాలు ఎవ్వరికీ ఇవ్వకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్ల వివిధ రకాల ఆశలు చూపి, జనం డబ్బు లూటీ చేస్తున్నారన్నారు. మొబైల్ ట్రేడింగ్ యాప్‌లతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని నిరుద్యోగులు, యువతీయువకులకు షేర్‌మార్కెట్ యాప్‌ల ద్వారా వాట్సాప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు, ఫోన్ కాల్స్ చేస్తుంటారన్నారు. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఒంటరిగా ఉంటున్నామనీ, న్యూఫ్రెండ్ కావాలని మెసేజ్‌లు పంపుతుంటారనీ, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రజలను ముగ్గులోకి దింపి, న్యూడ్ వీడియో కాల్స్ రికార్డు చేసి డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తారని హెచ్చరించారు. న్యూడ్, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లకు స్పందించకండన్నారు. సైబర్ నేరాలపై 1930కి ఫిర్యాదుచేయవచ్చన్నారు. జాతీయ సైబర్ క్రైం పోర్టల్ www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, హేమంత్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష, ఆర్ఐ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

పింఛన్ల పెంపు పెద్ద పండుగ





సమావేశంలో పాల్గొన్న టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, హాజరైన జడ్పీటీసీ సభ్యులు

- కొత్త సర్కారుకు జడ్పీ ధన్యవాదాలు
- కృష్ణ నది బోర్డు 'సీమ'లో పెట్టాలన్న ప్రతిపాదనకూ ఆమోదం
- డిప్యూటీ సీఈఓపై చర్యలకు సభ్యుల పట్టు
- ఓఅండ్ఎం బిల్లులు, అక్రమాలపై రభస
- క్యూకట్టిన కొత్త ఎమ్మెల్యేలు, ఎంపీలు
- సభలో పెరిగిన టీడీపీ హవా... వైసీపీ డీలా

అనంతపురం విద్య, జూలై 9: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఏప్రిల్ నెల నుంచే పెంచి ఆయా వర్గాల పేదలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పెద్ద పండుగ తెచ్చారని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ధన్యవాద తీర్మానం పంపాలని ప్రతిపాదన తెచ్చారు. ఈ ప్రతిపాదనలను జడ్పీ సభ్యులు బలపర్చి తీర్మానం చేశారు. కృష్ణ రివర్ బోర్డు కార్యాలయాన్ని గత ప్రభుత్వం విశాఖపట్నంలో పెట్టిందని, దాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని మరో ప్రతిపాదన తేగా జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు దాన్ని బలపరిచి తీర్మానం చేశారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో పదో జడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు.

టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల రాకతో కొత్త కళ

సమావేశంలో 2 గంటలపాటు డిప్యూటీ సీఈఓపై చర్యలు, ఓఅండ్ఎం నిధుల ఖర్చు, అధికారుల అవినీతి అంశాలపై రభస జరిగింది. ఆతర్వాత తాగునీరు, వ్యవసాయం, వైద్యం తదితర అంశాలపై చర్చలు ఆసక్తికరంగా సాగాయి. అయితే కొత్త ప్రభుత్వంలో జరిగిన తొలి సమావేశానికి కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రికార్డు స్థాయిలో పోటెత్తారు. 9 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు సభలో అడుగుపెట్టి ప్రజాసమస్యలపై మాట్లాడారు. మొన్నటి వరకూ కళకళలాడిన వైసీపీ సభ్యుల మొహాలు, గళాలు వెలవెలబోగా...టీడీపీ, బీజేపీ సభ్యులు హవా కొనసాగించారు. జడ్పీ సమావేశం 11.30 గంటలకు ప్రారంభించారు. తొలుత ఇటీవల మరణించిన పెనుకొండ జడ్పీటీసీకి సంతాప సూచకంగా సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ముందుగా వైద్యంపై చర్చ ప్రారంభించాలంటూ జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ చెప్పగా హిందూపురం ఎంపీ పార్థసారథి కలుగుజేసుకుని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీల పరిచయకార్యక్రమం జరగాలన్నారు. ఇందు ఆమె సమ్మతించారు. తర్వాత కొత్త ఎమ్మెల్యేలు, ఎంపీలు సభలో పరిచయం చేసుకున్నారు. తర్వాత టీడీపీ జడ్పీటీసీ ఉమేష్ కొత్త పింఛన్ల పెంపుపై మాట్లాడారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ మైక్ అందుకుని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము పెంచడం అభినందనీయమన్నారు. ఇంతలో వైసీపీ జడ్పీటీసీలు పింఛన్లు తగ్గిస్తున్నారంటూ మాట్లాడగానే ఎంపీ పార్థసారథి కలుగజేసుకుని అర్హులందరికీ అందేలా చేస్తామన్నారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో రూ.వెయ్యి మాత్రమే పెంచిన మీరా మాట్లాడేది అని ఫైర్ కావడంతో వైసీపీ సభ్యులు గమ్మున కూర్చున్నారు.

డిప్యూటీ సీఈఓపై చర్యలు ఏవీ?

సమావేశంలో గుడిబండ జడ్పీటీసీ భూతప్ప, రూరల్ జడ్పీటీసీ చంద్ర మాట్లాడుతూ జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి సభ్యులకు గౌవరం ఇవ్వడం లేదని, అవమానిస్తోందని, ఆమెను సరెండర్ చేస్తూ తీర్మానం చేసినా ఇంతవరకూ చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గత కలెక్టర్‌కు చెప్పినా చర్యలు లేవంటూ జడ్పీ చైర్‌పర్సన్ సైతం సభలో ప్రస్తావించారు. సభ్యులకు గౌరవం ఇవ్వకుంటే తప్పనిసరిగా యాక్షన్ తీసుకోవాలని ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలన్న వాదనను ఎంపీ పార్థసారథి, ఇతర ఎమ్మెల్యేలు సైతం బలపర్చారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్కువ మంది జడ్పీటీసీలకు అన్యాయం జరిగినట్లు వారి మాటల్లోనే అర్థమవుతోందన్నారు. ఇంతలో కాలవ మైక్ అందుకుని జడ్పీ డిప్యూటీ సీఈఓపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేయించి, చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందిస్తూ ఈ సమస్య తన దృష్టిలో లేదన్నారు. ఇప్పుడు సభ ద్వారా తన దృష్టికి వచ్చింద కనుక తప్పకుండా విచారన జరిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధుల పట్ల ప్రొటోకాల్ పాటించేలా ప్రతి సోమవారం జరిగే మీటింగ్‌లో అన్ని శాఖ అధికారులకు ఆదేశాలిస్తానన్నారు.

నిధుల మళ్లింపుపై ఆగ్రహం

తర్వాత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పై సమీక్ష చేశారు. ఎంపీ పార్థసారథి జల్‌జీవన్ మిషన్ కింద జిల్లాకు ఎంత డబ్బులు వచ్చాయంటూ ఆ శాఖ ఎస్ఈని ప్రశ్నించారు. మైనర్ రిపేర్లు కూడా చేయలేదు, అధికారులు ఏం చేశారంటూ ఎమ్మెల్యే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఅండ్ఎంకు భారీగా నిధులు మళ్లించారని, కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ ఎస్ఈ ఎహసాన్ బాషాపై జడ్పీ ఛైర్‌పర్సన్ మండిపడ్డారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, శింగనమల ఎమ్మెల్యే శ్రావణి సైతం దానిపై మాట్లాడుతూ ఆరు నెలల కిందట జరిగితే అప్పుడు అధికారంలో ఉన్న మీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. జేజేఎం డబ్బులు ఎంత వచ్చాయని, ఏం చేశారని అడిగారు. దీనికి ఎస్ఈ స్పందిస్తూ... రూ.500 కోట్ల వరకూ మంజూరు చేశారని, రూ.70 కోట్ల పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఓ అండ్ఎం నిధులు, అధికారుల అక్రమాలపై వైసీపీ సభ్యులు, అధికారుల మధ్య చర్చ హాట్ హాట్‌గా మారింది. ఆఖరికి కలెక్టర్ కలుగజేసుకుని ఈ నిధుల వినియోగం, అక్రమాలపై తనకు జడ్పీ నుంచి ఎలాంటి నివేదిక రాలేదన్నారు. తాగునీరు అత్యసరమని, అవసరం మేరకు చెల్లింపు చేసి ఉంటారన్నారు. సీఈఓ కానీ, జడ్పీ ఛైర్‌పర్సన్ కానీ తన దృష్టికి తేవాల్సి ఉండేదన్నారు. ఈ నిధులపై ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని సూచించారు. రెండు గంటలపాటు ఇదే గందరగోళం నెలకొంది. తర్వాత గ్రామాల్లో తాగునీరు, పీహెచ్‌సీలు, వాటితో సిబ్బంది, వసతులు, వ్యవసాయం, నాడు-నేడు పనులు, తదితర అంశాలపై చర్చ సాగింది. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్



వైసీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజు

తాగునీటి సమస్య పరిష్కరించండి



అనంతపురం జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీర్చాల్సిన అవసరం ఉంది. బోర్లు వేసి నీటి సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలి. ఉవరకొండ, శింగనమల తదితర ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లతో నీళ్లు అందిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలి. గతంలో 205 మంది ఎంపీఈఓలను గత ప్రభుత్వం చిత్తూరుకు బదిలీ చేసింది. వాళ్లను తిరిగి వెనక్కు రప్పించి న్యాయం చేయాలి.

- అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ, అనంతపురం

లోపాలు లేకుండా అమలు చేస్తాం



సభలో సమస్యల ప్రస్తావన, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలి. టీడీపీ అధినేత చంద్రబాబు పింఛన్ల సొమ్ము పెంపుపై ఆయావర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఎలాంటి అనుమానాలు వద్దు. లోపాలు లేకుండా అన్నీ అమలు అయ్యేలా చూస్తాం.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే

ఫ్లోరైడ్ సమస్య పై దృష్టి పెట్టండి



నా నియోజకవర్గంలో తీవ్ర నీటి కొరత ఉంది. గత ప్రభుత్వంలో అధికారులు ఏం చేసినట్లు. నేను వచ్చాక పలు చోట్ల బోర్లు కూడా వేయించాను. శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలో ఫ్లోరైడ్ అధికంగా ఉంది. దానిపై ప్రణాళికాబద్ధంగా అధికారులు ముందుకెళ్లి పరిష్కరించాలి.

- సురేంద్రబాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

జీజీహెచ్‌కు బడ్జెట్ పెంచండి



అనంతపురం జిల్లా కేంద్రంలో ఉండే సర్వజన ఆసుపత్రికి నిత్యం 1200 నుంచి 1300 మంది వస్తున్నారు. రోగులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 600 పడకల మేరకే బడ్జెట్ వస్తోంది. అయితే 1000 బెడ్స్ మేరకు బడ్జెట్ పెంచాలి. సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలి.

-దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం ఎమ్మెల్యే

మురుగు కలవకుండా చూడండి



పుట్టపర్తి నుంచి వచ్చే మురుగు చిత్రావతి నదిలో కలుస్తోంది. ఫలితంగా నీళ్లు కలుషితం కావడంతో పాటు డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. చౌటుకుంటపల్లి, సుబ్బరాయపల్లితోపాటు, నల్లమాడలోని పలు గ్రామాల్లో బోర్లు, మోటార్ల సమస్యల వల్ల నీటి ఎద్దడి ఉంది. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి. పలు చోట్ల కుక్కకాట్లు ఎక్కువ అవుతున్నాయి. మందులు సమకూర్చండి.

- పల్లె సింధూర, పుట్టపర్తి ఎమ్మెల్యే

నిధులు తెస్తాం.. అభివృద్ధి చేస్తాం



వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారు. లోకేశ్ పీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు భారీగా అభివృద్ధి జరిగింది. గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు పెద్ద ఎత్తున వేశారు. రోడ్లు వేశాం. ఈ ప్రభుత్వంలో పంచాయతీలు, మండల పరిషత్, జడ్పీలను కూడా నిర్వీర్యం చేశారు. వైఎస్ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. వైసీపీ వాళ్లకు మాట్లాడే అర్హత కూడా లేదు. మా నాయకుడు చంద్రబాబు సారథ్యంలో మరిన్ని నిధులు తెస్తాం. మరింత అభివృద్ధి చూపిస్తాం.

- బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం.

పార్టీలకు అతీతంగా అందిస్తాం



ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము పెంపుతో అందరిలో ఆనందం నెలకొంది. సభలో ఎలాంటి గొడవలు చేయరాదు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ భరోసా పింఛన్లు అందిస్తాం. చంద్రబాబు ప్రభుత్వంలో అర్హులందరికీ న్యాయం జరుగుతుంది.

- జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

తీర్మానాలు అమలయ్యేలా చూడండి



జడ్పీలో ఒక బీసీ మహిళ అధ్యక్షులుగా కూర్చోవడం అభినందనీయం. ఓ అండ్ ఎం నిధుల్లో అక్రమాలపై అధికారులను సరెండర్ చేయాలంటూ గత సభ్యులు తీర్మానాలు చేశారు. అయినా మళ్లీ అదే అధికారులు ఇక్కడ ఉంటే ఇక తీర్మానాలకు విలువేముంది. సభలో సభ్యులు చేసే తీర్మానాలు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉంది.

- కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే

నాడు-నేడులో రూ.కోట్ల స్కాం



గత ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు-నేడులో రూ. కోట్ల కుంభకోణం జరిగింది. మడకశిరలో 10 వేల సిమెంట్ బస్తాలు మాయం చేశారు. అవసరం ఉందో లేదో తెలుసుకోకుండానే... భారతి, పెన్నా వంటి సిమెంట్ కంపెనీ నుంచి నేరుగా సిమెంట్ బస్తాలు దించేశారు. గత ప్రభుత్వం వైసీపీ నాయకుల కోసం నాడు-నేడు పెట్టినట్లుంది. మడకశిరలో ఇప్పటికీ సచివాలయాలు, ఆర్‌బీకేల పనులు 70 శాతం వరకూ అసంపూర్తిగానే ఉన్నాయి.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

మందుల కొరత లేకుండా చూడాలి



శింగనమల మండలంలోని పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూడండి. ఐవీ ఫ్లూయిడ్స్ సమస్య ఉంది. రోగులను తెచ్చుకోమని చెబుతున్నారు. ఇటీవల నార్పలలో సమస్యను గుర్తించాను. గర్భిణులు ఇబ్బంది పడకుండా చూడండి. అదేవిధంగా బుక్కరాయసముద్రం, పుట్లూరు ఇతర మండలాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి.

- శ్రావణి, శింగనమల ఎమ్మెల్యే

ఉద్యోగాలకు 'సంస్కృతి' విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి, జూలై 9: విద్యాసంవత్సరంలో ప్రారంభంలోనే సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు 16 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బెంగళూరుకు చెందిన 24/7 ఏఐ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 250 మంది విద్యార్థులు పాల్గొనగా 16 మంది విద్యార్థులు 4.5లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఛైర్మన్ తెలిపారు. సహజంగా సంవత్సరం ముగింపులో క్యాంపస్ సెలక్షన్లు జరుగుతాయని అయితే జూలైలోనే రిక్రూట్ మెంటు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రతిఏటా తమ కళాశాల నుంచి అత్యధిక శాతం విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్లు దివ్య, శ్రీకన్య, డీన్ బాలకోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీబీ జలాశయంలో 22 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్, జూలై 9: తుంగభద్ర జలాశయంలోకి మంగళవారానికి 22.825 టీఎంసీలు చేరాయి. ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 23,079 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 156 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారుల వెల్లడించారు. జలాశయంలోకి వరదనీరు హెచ్చుతగ్గులతో వస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీప్యాట్‌లో జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ



జాహ్నవి | చరణ్ | ప్రేమలత | హేమంత్

అనంతపురం సెంట్రల్, జూలై 9: ఎంఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీప్యాట్) ఫలితాల్లో జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 22మంది విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు కైవసం చేసుకుని వర్సిటీ ఖ్యాతిని చాటారు. జాతీయ స్థాయిలో జాహ్నవి 1374, గణేష్ 1650, గురుచరణ్ 1753, ప్రేమలత 2228, హేమంత్ 3098, అనిల్‌కుమార్ 3889, విజ్ఞత 4523 యశ్వంత్ 5352, శ్రీనాథ్ 5789, తబస్సుమ్ 7059, నవీన్ 8100, జగదీశ్వర్ గౌడ్ 8751, మురళీధర్ 9203, చంద్రికాలక్ష్మి 11504, అంచల్ మన్నత్ 13391, మోహన్ 14000, దినేష్ 16112, చరణ్ 1753, ప్రేమలత 2228, కీర్తి 24053, దివ్య 32097, హేమంత్ 3098వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దుర్గాప్రసాద్ విద్యార్థులను అభినందించి ఉత్తమ ర్యాంకులు సాధించడం సంస్థకు గర్వకారణమి కొనియాడారు.

చావునీ వదలని సైబర్ నేరగాళ్లు

బెళుగుప్ప, జూలై 9: ఇంటికి పెద్దదిక్కును కోల్పోయి శోకసంద్రంలో ఉన్న కుటుంబాన్ని సైతం సైబర్ నేరగాళ్లు వదలలేదు. 'నేను డీఎస్పీని మాట్లాడుతున్నా..! మీకు బీమా మంజూరైంద'ని చెప్పి రూ.18500 ఫోన్‌పే చేయించుకుని మోసపుచ్చిన ఉదంతం మండలంలోని నక్కలపల్లిలో వెలుగుచూసింది. బాధితులు తెలిపిన మేరకు.. మూడు రోజుల కిందట రైతు తిప్పేస్వామి(46) గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వీరంతా శోకంలో ఉండగానే మంగళవారం ఓ ఫోన్ వచ్చింది. డీఎస్పీని మాట్లాడుతున్నాననీ, తిప్పేస్వామికి రూ.నాలుగు లక్షలు ఇన్సూరెన్స్ మంజూరైందనీ, బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామనీ, 9611156511 నంబర్‌కు రూ.18500 ఫోన్‌పే చేయాలని తెలిపారు. డీఎస్పీ అని చెప్పడంతో రైతు బంధువైన చిన్న తిప్పేస్వామి నమ్మి ఫోన్‌పే చేశారు. వివరాలు తెలుసుకోవడానికి కొన్ని నిమిషాల అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. పనిచేయలేదు. మరో నంబర్ నుంచి చేసినా స్పందించలేదు. మోసపోయామనీ, న్యాయం చేయాలంటూ బాధితుడు చిన్నతిప్పేస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

23న సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 9: జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఆర్డీటీ స్టేడియంలో జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఆగస్టు 10 నుంచి తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849553603ను సంప్రదించాలని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు



అనంతపురంరూరల్, జూలై 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 706టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మలయనూరులో వైసీపీ నాయకుల ఓవరాక్షన్



కళ్యాణదుర్గంరూరల్ సీఐ నాగరాజుపైనే ఎదురుదాడికి దిగుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి, జూలై 9: మండలంలోని మలయనూరులో పోలీసులపై వైసీపీ నాయకులు ఓవరాక్షన్‌కు దిగారు. రెండు రోజుల నుంచి గ్రామంలో వైసీపీ నాయకుల ఓవరాక్షన్ చేస్తున్న విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త లక్ష్మీ కాంత్‌పై గత నెలలో టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారని, పరామర్శించేందుకు వెళుతున్నామని ఆపార్టీ నాయకులు నానా హంగామా సృష్టించారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైసీపీ నాయకులు ఉమామహేశ్వరనాయుడు పెద్ద సంఖ్యలో నాయకులతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే టీడీపీ నాయకులు సోమవారం వీరందరినీ అడ్డుకుని తలారి రంగయ్య గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మంగళవారం కూడా అదే పంథాలోనే వైసీపీ నాయకులు సాగారు. ప్రశాంతంగా ఉన్న మలయనూరు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని పోలీసులు వారికి ఎంత నచ్చజెప్పినా వినకుండా, గ్రామానికి వెళ్లి తీరుతామంటూ పోలీసులపైనే ఎదురుదాడికి దిగారు. వైసీపీ కార్యకర్త లక్ష్మీకాంత్‌పై దాడి చేయకున్నా చేశారని అనవసర రాద్ధాంతం చేసేందుకు వైసీపీ నాయకులు సిద్ధమయ్యారని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. వైసీపీ నాయకుల ఓవరాక్షన్‌కు అడ్డు కట్ట వేసేందుకు మలయనూరు గ్రామంలో మంగళవారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలతో పాటు మరో 20 మందితో భారీ పోలీసు బందోబస్తుతో గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. ఐదు గురు నాయకులను మాత్రమే వైసీపీ కార్యకర్త లక్ష్మీ కాంత్‌ను పరామర్శించేందుకు అనుమతించి, మిగతావారిని అక్కడి నుంచి పంపించేశారు. ఒకే ఒక సాధారణ వ్యక్తిని పరామర్శించేందుకు వైసీపీ నాయకులు ఇంత అలజడి సృష్టించి రావడం సబబేనా అంటూ టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి అగ్నిగుండం ఏర్పాటు



ఆలయం ఎదుట అగ్నిగుండం తవ్వుతున్న గ్రామస్థులు

నార్పల, జూలై 9: ప్రసిద్ధి గాంచిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం ఎదుట మంగళవారం అగ్నిగుండం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కొన్ని వర్గాల వారు ఆనవాయితీగా అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం కుళ్లాయిస్వామి పీర్లను మకాన్‌లో కొలువుదీర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పారిశుధ్య పనులు, క్యూలైన్ ఏర్పాటు, మరుగుదొడ్లు, తదితర వాటిని ఏర్పాటు చేశారు. భక్తులు కుళ్లాయిస్వామికి సమర్పించిన కానుకలను, హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శాశ్వత హుండీల ద్వారా రూ. 11,84,310లు ఆదాయం రాగా, అన్నదానం హుండీ లెక్కించగా రూ. 2,49,771లు, 30.5కేజీల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జాఫర్‌వలి, తలారి రాజన్న, తలారి కుళ్లాయప్ప, నాగలింగప్ప, దేవదాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

టమోటా కిలో రూ.36

అనంతపురంరూరల్, జూలై 9: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డుకార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 75టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.26తో పలికినట్లు ఆయన తెలిపారు.

పాముకాటుతో విద్యార్థి మృతి


వెంకటేష్ (ఫైల్)

నంబులపూలకుంట, జూలై 9: మండలంలోని ధనియాన్ చెరువుకు చెందిన వెంకటేష్ (14) మంగళవారం పాము కాటుతో మరణించారు. పాతూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో నివాసమున్న మనోహర్, నారత్నల మూడో సంతానం ఇతను. స్వగ్రామంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్కూల్ ముగించుకుని ఇంటికొచ్చాడు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చిన వెంకటేష్‌ను పాము కాటు వేసింది. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా విషయాన్ని ఎమ్మెల్యే కందికుంది వెంకట ప్రసాద్ దృష్టికి తీసుకెళారు. ఆయన ఆదేశాల మేరకు ధనియాన్ చెరువు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అంజుంఅలీ, భానుప్రకాష్, బాలాజీ వెంటనే తల్లిదండ్రులతో కలిసి ఓ ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు.

చికిత్స పొందుతూ మహిళ...

బత్తలపల్లి, జూలై 9: మండలంలోని ముష్టూరు వాసి బత్తినన్న భార్య శివలక్ష్మి (33) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మరణించింది. అప్పులబాధ తాళలేక ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మరణించింది. ఆమెకు భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య


పవన్‌కుమార్ (ఫైల్)

ధర్మవరంరూరల్, జూలై 9: మండలంలోని పోతుకుంట బృందావనం కాలనీకి చెందిన యర్రప్ప, రామలక్ష్మమ్మ కుమారుడు గొల్ల పవన్‌కుమార్ (25) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవర్. ఇటీవల మద్యానికి బానిసై అప్పులు ఎక్కువ చేయడం తో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన పవన్‌కుమార్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ కొక్కికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని హెడ్‌కానిస్టేబుల్ మారెప్ప తెలిపారు.

వైసీపీ నాయకుడి అరెస్టు

కదిరి, జూలై 9: తలుపుల మండలం కుర్లి గ్రామంలోని హంద్రీనీవా కాలువ నిర్మాణానికి ఉపయోగించే ఇనుమును అధికారిని బెదిరించి తీసుకెళ్లిన కేసులో వైసీపీ నాయకుడు వెంకటశివారెడ్డి అలియాస్ కుర్లి శివారెడ్డిని అరెస్టు చేసినట్లు తలుపుల ఎస్ఐ వినోద్‌కుమార్ మంగళవారం తెలిపారు. హంద్రీనీవా కాలువ కోసం తలుపుల మండలం కుర్లి గ్రామంలో కొన్ని ఇనుప కడ్డీలను నిలువ ఉంచారు. దీన్ని గమనించిన కుర్లి శివారెడ్డి అధికారిని బెదిరించి ఇనుప కడ్డీలను తీసుకెళ్లాడు. దీనిపై హంద్రీనీవా అధికారి శివరామక్రిష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు సెక్షన్ 341, 386, 506 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు కుర్లి గ్రామంలో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన వద్ద నుంచి 1,610 కేజీల ఇనుప కడ్డీలు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడ్ని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

బైక్ దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో వన్‌టౌన్ సీఐ, సిబ్బంది

ధర్మవరం, జూలై 9: పట్టణంలో పలు ప్రాంతాలలో బైకులను దొంగలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన గుర్రం పాటి రాకేశ్ రణదీప్, మేకల నరసింహులు, నీలిసతీశ్‌కుమార్ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు మద్యానికి బానిసై చెడు వ్యసనాలకు అటువాటు పడ్డారు. కూలిపనులతో వచ్చేసంపాదన చాలక దొంగతనాలకు అలవాటు పడ్డారు. 2022 ఏప్రిల్ 25న ధర్మవరం పట్టణంలో మాధవనగర్, సాలేవీధి, రాఘవేంద్రస్వామి ఫంక్షన్‌హాల్, పీఆర్‌టీ వీధి తదితర ప్రదేశాల్లో ఇంటి ముందు ఉంచిన ఏడు టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఒక అప్పాచీ బైక్ చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో శివానగర్‌లోని శివాలయం వద్ద మంగళవారం కొందరు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకు ని విచారించారు. వారు బైకులను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో గుర్రం పాటిరాకేశ్ రణదీప్, నీలి సతీశ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు మేకల నరసింహులు కోసం గాలిస్తున్నారు. వారి నుంచి మొత్తం 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

బియ్యం పట్టివేత

అమడగూరు, జూలై 9: మండలంలోని మారుతీపురం సమీపంలో ఎస్ఐ మగ్బుల్‌బాషా, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మంగళవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆంధ్రా నుంచి కర్ణాటకకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని... కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


జయశంకర్ (ఫైల్)

బుక్కపట్నం, జూలై 9: మండలంలోని సిద్దరామపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తలారి జయశంకర్ (65) మంగళవారం గుండెపోటు మరణించాడు. ఇతను మండలంలోని గూనిపల్లి సింగల్ విండో అధ్యక్షుడిగా పనిచేశారు. అతని భార్య శాంతమ్మ 2006లో టీడీపీ తరపున సిద్దరామపురం ఎంపీటీసీగా గెలించారు. మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప జయశంకర్ మృతదేహానికి నివాళులర్పించారు. భార్య శాంతమ్మకు రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంతి పల్లెరఘునాథ్‌రెడ్డి ఫోన్‌ద్వారా పరామర్శించారు.

పచ్చిగడ్డితోనే అధిక పాలదిగుబడి

బత్తలపల్లి, జూలై 9: పాడి రైతులకు తమ పశువులకు పచ్చిగడ్డి వేస్తే అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధక శాఖ ఏడీలు శ్రీనివాసులు, చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పోట్లమర్రి గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పాడిరైతులు తమ పశువులకు ఎండుగడ్డితో పాటు పచ్చిగడ్డి కూడా వేస్తే అధిక పాల దిగుబడులు వస్తాయన్నారు. వర్షాకాలంలో జొన్న సాగుచేసుకోవాలన్నారు. 45 రోజులు దాటిన తరువాత ఆ చొప్పను పశువులకు వేస్తే అధిక పాలదిగుబడి వస్తుందన్నారు. సబ్సిడీతో సీఎస్‌హెచ్ జొన్నరకం విత్తనాలు అందిస్తున్నామని, రైతులు వాటిని తీసుకోవాలన్నారు. పశువైద్యాధికారి గురునాథరెడ్డి, సిబ్బంది సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

నంబులపూలకుంట, జూలై 9: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జోగివారిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించాలన్నారు. అనంతరం స్థానిక ఆర్బీకేలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మట్టినమూనా ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ అబ్దుల్ అలీ, ఏఓ లోకేశ్వరరెడ్డి, ఏఈఓ శిరీష ఉన్నారు.

మసకవంకపల్లిలో మురుగు సమస్య

నల్లమాడ, జూలై 9: మండలంలోని మసకవంకపల్లి గ్రామంలో మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉంటోంది. ఈ కాలువ మధ్యలో పంచాయతీ తాగునీటి బోరుంది. అక్కడ మురుగునీరు నిలువ ఉండడంతో బోరులోకి మురుగునీరు ఇంకి.. తామంతా రోగాల బారిన పడుతన్నామని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నా రు. మురుగు నిల్వ వల్ల ప్రస్తు తం దోమలు అధికమయ్యాయని, గ్రామస్థులు విషజ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగు నీటి నిల్వల వద్ద పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా .. కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


తాగునీటి బోరువద్ద నిల్వ ఉన్న మురుగు నీరు

గోవుల ఘోష పట్టదా...?

- నిరుపయోగంగా గోశాల
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- రోడ్లపై చెత్తను తింటూ సంచరిస్తున్న ఆవులు


గోవుల కోసం నిర్మించిన షెడ్డు


మద్యం సేవించి, తొట్టెలో పడేసిన బాటిళ్లు


కదిరి ప్రధాన రహదారిలో సంచరిస్తున్న గోవులు

గాండ్లపెంట, జూలై 9: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తుల కోరికలు తీరితే స్వామివారికి అన్నదానం, బంగారం, వెండి, డబ్బులు, తులా భారంతో పాటు గోవులనూ దానం ఇచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. కదిరి లక్ష్మీనరసిం హస్వామి ఆస్తులన్నీ ఆలయాధికారులు పర్యవేక్షిస్తా రు. గోవులను మాత్రం పట్టించుకోక పోవడంతో అవి రోడ్లపై తిరుగుతున్నాయి. దీంతో గోవుల సంరక్షణ అధికారులు, పాలకులకు పట్టావా అని భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ. 20 లక్షలతో గోశాల నిర్మాణం

గాండ్లపెంట మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ సమీపంలోని విశ్వయోగివేమన కొండ వద్ద ఖాద్రీన రసింహస్వామి ఆలయం భూముల్లో గోశాలను దాదాపు రూ.20 లక్షలతో నిర్మించారు. రేకులషెడ్, చుట్టు ముళ్లకంచె ఏర్పాటు చేశారు. దీన్ని నిర్మించి... దాదాపు పది సంవత్సరాలకు పైగా అవుతోంది. ఇంతవరకు గోశాలలో ఒక్క గోవును కూడా ఉంచిన దాఖలాలు లేవు. దీంతో కదిరి లక్ష్మీనరసింహస్వామికి ఇచ్చిన గోవులు రోడ్లపై తిరుగుతున్నాయి. మరి రూ.లక్షల ఖర్చు చేసి గోశాల ఎందుకు నిర్మించారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల గోశాల కూడా నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం ఈ గోశాల మందుబాబులకు అడ్డాగా మరింది.

గో రక్షణపై నిర్లక్ష్యం

కదిరి పురవీధుల్లో, ప్రధాన రహదారిలో ఎటు చూసినా, గోవులు దర్శనమిస్తుంటాయి. కదిరిలో గోవులకు పచ్చి గడ్డి దొరకడం కష్టం. దీంతో అవి చెత్త, వ్యర్థపదార్థాలు తింటూ జీవిస్తున్నాయి. అనారోగ్యం పాలవుతున్నాయి. ఇవి రోడ్లపై సంచరిస్తుండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా లక్ష్మీనర సింహస్వామి పేరుతో భక్తులు వదిలిన గోవులను సంరక్షించాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉందని, అయినా ఆలయ అధికారులు గోవుల సంరక్షణను ఎందుకు పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ గోవులు ఆలయానివి కావు..

కదిరి ప్రధాన రహదారుల్లో, పురవీధులో తిరుగుతున్న పశువులు శ్రీఖాద్రి లక్ష్మీనరసింహస్వామికి సంబంధించినవి కావు. భక్తులేవరూనా దృష్టికి తీసుకువచ్చి దానం చేయలేదు. అప్పటిలో కటారుపల్లి సమీపంలో గోశాల నిర్మించారు. గోవులను అక్కడ ఉంచడానికి వీలుకాలేదు. తమ వద్ద కేవలం ఆరు గోవులు మాత్రమే ఉన్నాయి.

-శ్రీనివాసరెడ్డి, ఈఓ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ధర్మవరం/రూరల్, జూలై 9: స్థానిక తిక్కస్వామి నగర్‌లోని పోతలయ్యస్వామి, వీరదిమ్మమ్మ అమ్మవారి 24వ వార్షికోత్సవ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోతలయ్యస్వామి పూజారి మాదన చితంబరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ముందుగా స్వామివార్ల ప్రభలను ఏర్పాటుచేసి వెండిగొడుగులతో అలంకరించారు. అనంతరం స్వామివార్లకు వేపమండలు, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం పోతలయ్యస్వామి, వీరది మ్మమ్మ, సుబ్బరావుపేట ఎర్రదొడ్డి గంగమ్మ, చాముం డేశ్వరి అమ్మవారు, జలకంటేశ్వరి, చౌడేశ్వరి అమ్మవార్ల ప్రభలు పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.


స్వామివార్లను ఊరేగిస్తున్న భక్తులు

మొక్కులు తీర్చుకున్న గ్రామస్థులు


అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్థులు

గాండ్లపెంట, జూలై 9: కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయం సాధించడంతో మండలంలోని తూపల్లి పంచాయతీలోని వంకపల్లి మారెమ్మకు గ్రామస్థులు మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి బోనాలు, ప్రత్యేక పూజలు , కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో తూపల్లి సర్పంచ్ కుమారుడు సిద్దారెడ్డి, టీడీపీ నాయకులు ఉత్తన్న, విశ్వనాథ్, వీరనారాయణ, రమేష్, గంగిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, రఘు, ఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

కదిరిఅర్బన్, జూలై 9: కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. సోమవారం బుక్కపట్నం సత్యసాయి బాలుర పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సాయిగణేష్, నవీన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఆగస్టులో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.


ఎంపికైన విద్యార్థులు

ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, జూలై 9: ప్రమాదాలను దీటుగా ఎదుర్కొనడంపై సత్యసాయి ఎయిర్‌పోర్టులో పోలీసులు మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్, సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు సీఐ బొజ్జప్ప, ఆర్ఐ చంద్రశేఖర్, సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు ఎయిర్‌పోర్టులో బాంబులు పెట్టినపుడు వాటిని డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్, సిబ్బంది ఎలా పసిగట్టాలో.. ఎలా నిర్వీర్యం చేయాలో.. ప్రమాదాన్ని ఎలా తప్పించాలనే విషయాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


అలంకరణలో వాసవీమాత

ధర్మవరం,జూలై 9: స్థానిక తేరుబజారులో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం మొదటి మంగళవారం సందర్భంగా వాసవీమాతకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మూలవిరాట్ కన్యకాపరమేశ్వరి దేవికి వివిధ ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

వీధిదీపాలకు మరమ్మతులు

నంబులపూలకుంట, జూలై 9: మండల కేంద్రంలో వెలగని విద్యుత్ దీపాల స్థానంతో కొత్త వాటిని ఏర్పాటు చేసి.. మరమ్మతులు చేయిస్తున్నట్లు సర్పంచ్ ఆంజనమ్మ మంగళవారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధిదీపాలు చెడిపోవడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

కొత్తచెరువు, జూలై 9: ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలని యూటీఎఫ్ నాయకులు ఆర్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 117 జీఓను తీసుకువచ్చి ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేసిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు దూరప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లలేక చదువును మధ్యలోనే ఆపేశారన్నారు. అంతేకాకుండా సీపీఎస్ విధానం అమలు చేస్తానని చెప్పి.. జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. పాతపెన్షన్ విధానాన్ని కొత్తప్రభుత్వమైన అమలు చేయాలని కోరారు.

తెగిన చిత్రావతి కాజ్‌వే

ఏడాదైనా చేపట్టని మరమ్మతులు
వర్షం వస్తే రాయలవారిపల్లి వాసులకు తిప్పలే..


రాయలవారిపల్లి వద్ద చిత్రావతిలో కొట్టుకుపోయిన కాజ్‌వే

పుట్టపర్తి, జూలై 9: జిల్లా కేంద్రానికి సమీపంలోని రాయలవారిపల్లి గ్రామస్థులు వర్షం వస్తే కష్టాలు ప్రారంభమైనట్లే. గత సంవత్సరం చిత్రావతికి నీరొచ్చి... కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామస్థులు ఊరుదాటి బయటకు వెళ్లాలంటే నానాకష్టాలు పడాల్సిందే. కేవలం వంద మీటర్ల చిత్రావతి కాజ్‌వే దాటితే ఎనుమలపల్లిలోకి వెళ్లొచ్చు. అయితే చిత్రావతి నుంచి నీరు వస్తే ఇక రాయలవారిపల్లి గ్రామస్థులు నాలుగు కిలోమీటర్లు చుట్టేసుకొని వెళ్లాల్సిందే. ఇక వర్షం వస్తే విద్యార్థులు బడికి వెళ్ల లేని పరిస్థితి ఉంది. కాజ్‌వే కొట్టుకొని పోయి ఏడాది అయినా.. ఇంతవరకూ మరమ్మతులు చేపట్టలేదు.

మట్టివేసి మమ అనిపించారు..

వర్షానికి తెగిపోయిన కాజ్‌వేని ఏర్పాటు చేయాలని గ్రామప్రజలు పలుమార్లు అధికారులు , ప్రజాప్రతినిధులను కోరారు. గత ప్రభుత్వంలో ప్రజలు వచ్చిపోవడానికి మట్టిపనులు చేయించి మమ అనిపించారు. ఆ మట్టి రోడ్డు కూడా వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రస్తుత వర్షాకాలంలో నదిలోకి నీరుచేరితే నడుములోతు నీరు ప్రవహిస్తుంది.

కొత్తప్రభుత్వంపై ఆశలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్తప్రభుత్వం కాజ్‌వేని ఏర్పాటు చేస్తుందని, తమకు రహదారి కష్టాలు తీరతాయని రాయలవారిపల్లి గ్రామస్థులు ఆశలు పెట్టుకున్నారు. చిత్రావతిలో తాత్కాలికంగా పైపులైనా వేసి రహదారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


నిలిచిపోయిన ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జూలై 9: మండలంలో నెలకొన్న సమస్యలను టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ద్వారా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి రాజేంద్రతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్థాంతరంగా ఆగిపోయిన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 143జీవో ప్రకారం గతంలో 21 మందిని బదిలీ చేశారని, అయితే మలకవేముల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోకి కేవలం 4 సచివాలయాలు మాత్రమే వస్తాయని, ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోకి 17 సచివాలయాలు వస్తాయని అన్నారు. సిబ్బందిని బదిలీ చేయడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం అధికమవుతోందన్నారు. ఈ సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయండి


ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 9: పట్టణంలో నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. పట్టణానికి అమృత్ పథకం కింద ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరయ్యాయి. వైసీపీ నాయకులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడంతో వారు నిర్మాణపనులను అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో ఏటా నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ నేపథ్యంలో ఎల్-2 లో ఆగిపోయిన ఓహెచ్‌ఆర్‌ను టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, ఫణికుమార్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, మున్సిపల్ ఏఈ ప్రతాప్ తదితరులు మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ... మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు వీటిని పరిశీలించామన్నారు. ట్యాంకుల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వార్డుల్లోనూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటికి అక్కడిక్కడే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

నేడు ధర్మవరానికి మంత్రి సత్యకుమార్ రాక

ధర్మవరం, జూలై 9: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ధర్మవరం వస్తున్నట్లు డీపీఆర్‌ఓ వేలాయుదం తెలిపారు. విజయవాడ నుంచి రైల్లో మంగళవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి బుధవారం ఉదయం 6.10 గంటలకు అనంతపురం చేరుకుంటారని, అనంతపురం నుంచి 9.20 గంటలకు బయలుదేరి 9.50 గంటలకు ధర్మవరం చేరుకుంటారని తెలిపారు. 9.50 నుంచి సాయంత్రం 6గంటల వరకు ధర్మవరం నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులతో సమావేశం కానున్నారు. ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌లో 10.30 గంటలకు ధర్మవరం-చెన్నై నూతన బస్సును మంత్రి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణరావు తెలిపారు.

సురక్షిత్ మాతృత్వ అభియాన్

ఓబుళదేవరచెరువు, జూలై 9: స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ప్రధానమంతి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 70 మంది గర్భవతులు హాజరుకాగా, 34 మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించారు. వారికి అత్యవసర చికిత్సను అందించారు. వారిలో 21 మందికి ఉచిత స్కానింగ్, మందులు అందించి నట్లు వైద్యాధికారి భానుప్రకాష్ నాయక్ తెలిపారు. కాగా, గర్భవతులకు కదిరి రోటరీ క్లబ్ ప్రెసిండెంట్, సెక్రటరీ పృధ్వీ నితీన్, వైద్యులు రోబ్, కవిత, లక్ష్మీదేవి, వనిత, విష్ణు ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం గర్భవతులకు పసుపు, కుంకుమతో పాటు సారె అందించారు.


గర్భిణులకు సారె పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పోలీస్‌స్టేషన్ తనిఖీ

తనకల్లు, జూలై 9: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్ఐ ధరణీ బాబును అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి విచ్చలవిడిగా మద్యం రవాణా కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



ఓపీ కౌంటర్ వద్ద వేచివున్న జనం

పురం.. జ్వరం..!

● హిందూపురంలో ప్రబలుతున్న విషజ్వరాలు ● ఎవరిని కదిలించినా అనారోగ్యమే
● దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలతో విలవిల ● పరిసరాల అపరిశుభ్రతతో దోమల వ్యాప్తి

హిందూపురం అర్బన్, జూలై 9: పురం పరిసరాల్లో అనారోగ్య బాధితులు ఎక్కువైపోతున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతుంది. చిన్నా పెద్దా తేడాలేకుండా పలువురు సమస్యలతో ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ఎవరిని కదిలించినా విషజ్వరాలు, దగ్గు, విరేచనాలు, జలుబుతో బాధ పడుతున్నట్లు వాపోతున్నారు. రోజుకు 800 మందికి పైగా ఓపీలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. చిన్నపిల్లల వార్డులో అయితే మంచాలు నిండిపోయాయి. వాతావరణంలో మార్పు, అక్కడక్కడా వర్షాలు కురవడంతో మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండిపోయి మురిగిపోయింది. దీంతో దోమలు పెరిగిపోయాయి. దోమకాటుకు గురై విషజ్వరాల భారిన పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో కాల్వల ఏర్పాటు లేకపోవడంతో రోడ్లపైకే మురుగునీరు వదిలేస్తున్నారు. దీంతో అవి అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ముక్కడిపేట, ఆబాద్‌పేట, బాలాజీ సర్కిల్, అంబేద్కర్‌నగర్, అమృత్ మహాల్, డీఆర్ కాలనీ, డీబీ కాలనీ, శ్రీకంఠపురం నింకంపల్లి తదితర ప్రాంతాల్లో కాలువల్లో మురుగు నీరు ఎక్కువగా నిలువ ఉండి పోతుంది.

కదలని మురుగునీరు

ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు కాలువల్లో నిలువ ఉండి పోయి ఆ నీరు పచ్చగా మారిపోతుంది. ఆ మురుగు ముందుకు కదలడానికి వీలు లేక నిలువ ఉండిపోతుంది. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల ఉత్పత్తికి నిలయంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ చూపి కాలువలు శుభ్రం చేసి మురుగు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టి, ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దానితో పాటు చాలా ప్రాంతాల్లో చెత్తను మూడు రోజులకో మారు తొలగిస్తున్నారు. అక్కడ పందులు, కుక్కలు చింద వందరగా చేసి అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి.



బాలాజీ సర్కిల్ వద్ద మురుగునీరు



తీవ్ర జ్వరంతో నీరసించిన విద్యార్థిని



మందుల కోసం కిటకిట

అప్రమత్తంగా ఉండాలి

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త పడాలి. దోమతెరలను ఉపయోగించాలి, దోమలబత్తి లాంటివి ఉపయోగించాలని వైద్యులు సూచిస్తున్నారు. పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, తదితర వాటిలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలి. కాంచి చల్లారిన నీటినే తాగాలి. అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. అపరిశుభ్రతపై వివరణ అడుగుదామంటే మున్సిపల్ కమిషనర్ స్పందించలేదు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని వాటిపట్ల అవగాహనకలిగి అప్రమత్తంగా ఉండాలని సంతేబిదనూర్ ఆయుష్ హెల్త్ వెల్ఫేర్ సెంటర్ వైద్యురాలు అనురాధ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు వ్యాధులపై అవగాహన కల్పించారు.

మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలా..?

●రూ.కోట్ల ఖర్చుతో నిర్మించింది అందుకేనా? ● టీడీపీ నాయకుల మండిపాటు



మార్కెట్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 9: హిందూపురం పట్టణవాసుల కలను గత తెలుగు దేశం హయాంలో నెరవేరుస్తూ కోట్లు ఖర్చుపెట్టి కూరగాయల మార్కెట్ నిర్మిస్తే అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కౌన్సిలర్లతో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.25 కోట్లు ఖర్చుచేసి మార్కెట్ నిర్మిస్తే కొంత మంది వేలంలో పాడుకున్నా, వ్యాపారాలు చేసుకోక మరికొంతమంది బయట వ్యాపారం చేస్తున్నారన్నారు. కూరగాయల మార్కెట్ మట్కా రాయడానికి, పేకాట ఆడటానికి, మద్యం సేవించడానికి అడ్డాగా మార్చారని ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లిందని వెంటనే కూరగాయల మార్కెట్ గదులు పాడుకున్నవారు వ్యాపారాలు ప్రారంభించాలన్నారు. వ్యాపారులు మున్సిపాలిటీకి అద్దె చెల్లించాలన్నారు. మార్కెట్ పైఅంతస్థులో కార్యాలయాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతూ మార్కెట్‌కు రంగులు పూయించాలన్నారు. అవసరమైతే వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అదేవిధంగా పరిగి బస్టాండులో అక్రమంగా నిర్మించుకున్న రేకుల షెడ్లను పరిశీలించారు. అనంతరం సబ్‌రిజిష్టర్ కార్యాలయానికి వెళ్లి కార్యాలయం ఆవరణలో వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సబ్‌రిజిష్టర్ భాగ్యశేఖర్‌రెడ్డి, మోహన్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్, రాఘవేంద్ర, సతీష్, నాయకులు అమర్నాథ్, ప్రెస్‌వెంకటేశ్, డైమండ్‌బాబా, చంద్రమోహన్, ప్రవీణ్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, నబీరసూల్, అనిల్‌కుమార్, సుమోశీన, భార్గవ్, మహేష్ పాల్గొన్నారు.

పగలే చోరీ

● పది తులాల బంగారు అపహరణ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

చిలమత్తూరు, జూలై 9 : పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడి పది తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. మండలంలోని మరువకొత్తపల్లి బీసీ కాలనీలో నివాసమున్న మధుగిరేపల్లి శంకర్‌రెడ్డి ఇంట్లో భారీ చోరీ జరిగింది. మంగళవారం మిట్ట మధ్యాహ్నం దుండగులు జొరబడి ఇంట్లో ఉన్న పదితులాల బంగారాన్ని అపహరించుకెళ్లారు. అతని భార్య ఈశ్వరమ్మ, మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటిబయట స్నానపుగదిలో స్నానానికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె భర్త శంకర్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లారు. దీనిని గుర్తించిన దుండగులు కాపుకాచి ఆమె బాత్రూమ్‌లోకి వెళ్లగానే బయట నుంచి బాత్రూమ్ తలుపులకు గడియపెట్టారు. వెంటనే ఇంట్లో జొరబడి నేరుగా బీరువా ఉన్న గదిలోకి వెళ్లారు. బీరువా తలుపులను ఇనుప గునపంతో ధ్వంసం చేసి అందులో ఉన్న ఆరు తులాల బంగారు గొలుసు, మరో రెండున్నర తులాల గొలుసు, మూడు జతల బంగారు చెవి కమ్మలు, ఉంగరం ఎత్తుకెళ్లారు. స్నానానికి వెళ్లిన ఈశ్వరమ్మ తలుపుతీయడానికి ప్రయత్నించి రాకపోవడంతో బలంగా లాగింది. దీంతో తలుపు తెరుచుకోగా బయటకు వచ్చింది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. లాకర్ పగలకొట్టి బంగారు నగలు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించి ఆమె గట్టిగా అరుస్తూ బయటకు వచ్చింది. చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. బంగారంతోపాటు ట్రాక్టర్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు, ఆస్తి పత్రాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. జరిగినసంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెంపుడు కుక్కపై విషప్రయోగం



నీరసంగా ఉన్న కుక్క

దుండగులు చోరీకి పాల్పడే ముందు బాధితులు పెంచుకుంటున్న పెంపుడు కుక్కపై విషప్రయోగం చేశారు. దీంతో పెంపుడు కుక్క కళ్లు తెరవలేక నీరసంగా కిందపడిపోయింది. దీనిని ఆసరాగా చేసుకున్న దుండగులు ఇంట్లోకి సులభంగా వెళ్లి తమ పని కానిచ్చేశారు. పెంపుడు కుక్క మంచి స్థితిలో ఉంటే దుండగులను రానిచ్చేది కాదని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు.



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గర్భిణులకు అన్నదానం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 9: ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ట్రస్ట్ తరఫున ముఖ్య అతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దలింగప్ప, వెంకటేశులు, ఎంపీటీసీలు చిన్న బాబయ్య, కిష్టప్ప, నాయకులు చెన్నాపురం అంజి, సతీష్‌లౌలి, సోషల్‌మీడియా ప్రతినిధి నాగరాజుయాదవ్, ఐటీడీపీ నాయకులు మద్దిలేటి, టౌన్ కన్వీనర్ సూరి పాల్గొన్నారు. పెనుకొండ మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, పౌష్టికాహారం అందజేసినట్లు వైద్యాధికారి నాగరాజునాయక్ తెలిపారు.

● మండలపరిధిలోని తుంగోడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజినేయులు(38)మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెంకటేశ్వర్లు గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు రామిరెడ్డి, అశ్వర్థరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మహావృక్షాలను కూల్చవద్దు

● పర్యావరణ వేత్త డాక్టర్ శంకర్‌నారాయణ



మర్రిచెట్టును కూల్చవద్దని ఆందోళన చేస్తున్న శంకర్‌నారాయణ

గోరంట్ల, జూలై 9: రోడ్ల విస్తరణ, అభివృద్ధి పేరుతో మహావృక్షాలను కూల్చివేయడం తగదని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ శంకర్‌నారాయణ పేర్కొన్నారు. ముదిగుబ్బ, కోడూరు హైవే విస్తరణలో భాగంగా మండలంలోని బూదిలి పాఠశాల ముందున్న మర్రిచెట్టు పెద్ద కొమ్మలను తొలించారు. విషయం తెలుసుకున్న శంకర్‌నారాయణ మంగళవారం పాఠశాల వద్దకు చేరుకుని వృక్షాన్ని పరిశీలించారు. ఇది వందేళ్లుగా నీడనిస్తున్న మర్రిచెట్టని, దీనిని తొలగించవద్దని విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. విద్యార్థులు పచ్చదనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. గ్రీన్‌భారత్ నూతన కమిటీ అధ్యక్షులుగా వినోద్, ఉపాధ్యక్షుడిగా రాహుల్, కార్యదర్శి శబరీస్, సంయుక్త కార్యదర్శి ఆనంద్, సభ్యులు మహేష్, మనోజ్, వినయ్‌ని ఎంపిక చేశారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

మడకశిర రూరల్, జూలై 9: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఎంఈఓ నరసంహమూర్తి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి పేర్కొన్నారు. మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో శిశుసంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో మంగళవారం 'బాల్య వివాహాలు అరికడదాం-ఆడబిడ్డలను కాపాడుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే వారికి బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం శిక్షార్హులు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు కృష్ణమోహన్, వీఆర్ఓ మురళికృష్ణ, ఉపాధ్యాయలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 9: సోమందేపల్లిలోని సర్వే నంబరు 700లో అక్రమ నిర్మాణాలను మంగళవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు తొలగించారు. అనుమతులు, పట్టాలు లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి 40కి పైగా నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ అంజనాదేవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసుల సాయంతో వాటిని తొలగించినట్లు తెలిపారు. పేదల గుడిసెలు, ఇళ్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు తొలగించారని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కాటమయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల తొలగింపునకు నిరసనగా వారు తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో వంటావార్పు కార్యక్రమంతో ధర్నాకు దిగారు. సర్వేనంబరు 700లో 6.42ఎకరాలుండగా అందులో ప్రభుత్వ అవసరాలకు పోను మిగిలిన 3.90ఎకరాల్లో 150మంది పేదలు మూడు నెలలుగా గుడిసెలు వేసుకుని పక్కా ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఇళ్ల తొలగింపులో న్యాయపోరాటానికి దిగుతామన్నారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే అధికారులు ఇలాంటి చర్యలకు పూనుకోవడం సబబు కాదన్నారు. పేదలకు పక్కా ఇళ్లు సాధించేవరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, చాంద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఐ నాయకులు

పీహెచ్‌సీలో పీఎం సురక్ష మాతృత్వ అభియాన్

హిందూపురం(పరిగి), జూలై 9: పరిగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు స్వరూపరెడ్డి, నవీన గర్భిణులకు రక్తపీడన, మధుమేహ, గర్భస్త, పిండ, హృదయస్పందన పరీక్ష, బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 101మంది గర్భిణులు హాజరైనట్లు వైద్యులు తెలిపారు. ఉచిత పౌష్టికాహార భోజనం దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వేణుగోపాల్‌రావు ద్వారా అందించారు.

షెడ్లు తొలగించాలని నోటీసులు ఇవ్వడం దారుణం

హిందూపురం అర్బన్, జూలై 9: షెడ్లు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నోటీసులు ఇవ్వడం దారుణమని రాజకీయా పార్టీల ఐక్యవేదిక ప్రతినిధులు వాపోయారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీసీ డిపోమేనేజర్ శ్రీకాంత్‌కు వినతులు అందించారు. ఏడాది క్రితం ఆర్టీసీ స్థలంలో టెండర్ల ద్వారా షెడ్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. మున్సిపాలిటీ అనుమతి లేకుండా నిర్మించరాదని, వాటిని తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ షెడ్లలో వ్యాపారం చేసుకుంటున్న 25 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్లు నిర్మిస్తున్న సమయంలో మున్సిపల్ శాఖ నిద్రావస్థలో ఉందా అని ప్రశ్నించారు.

జాడలేని వరుణుడు..!

వర్షం కోసం అన్నదాత ఎదురుచూపు



వేరుశనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

మడకశిర, జూలై 9 : ఖరీఫ్ ప్రారంభంలో ఆశ చూపిన వరుణుడు మళ్లీ ఆచూకీ లేకుండా పోయాడు. తొలకరి వానలను చూసి అన్నదాత అప్పులు చేసి మరీ సాగుకు ముందుకు కదిలాడు. వేరుశనగ సాగుకు సిద్ధమయ్యాడు అయితే 25 రోజులుగా వర్షం కోసం రైతన్నలు ఎదురు చూస్తూనే ఉన్నారు. రెండు రోజుల క్రితం కొద్ది పాటి వర్షం కురిసింది. అరకొర వర్షాలతో అన్నదాకు ఎదురుచూపు తప్పడం లేదు. నియోజకవర్గంలోని అగళి మండంలో ఇప్పటివరకు ఎటువంటి సాగు ప్రారంభం కాలేదు. రొళ్ల మండలంలో 1743 హెక్టార్లు, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో మూడువేలహెక్టార్లకు పైగా వేరుశనగ సాగు చేశారు. ఇప్పటివరకు 50 శాతం మాత్రమే సాగయింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో 28 వేల హెక్టార్లు సాగు అవ్వాల్సి ఉంది. గతేడాది కరువుతో విలవిలలాడిన రైతులు ఈ సారైనా వర్షాలకు కురిసి సాగు చేద్దామని ఆశతో అప్పులు చేసి మరీ విత్తనాలు నాటారు. వాన రాకపోవడంతో అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

13 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు

నియోజకవర్గంలో 13 వేల హెక్టార్ల కు పైగా వేరుశనగ సాగు అయ్యిందని వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. నియోజకవర్గంలో నార్మల్ ఏరియా 28వేల హెక్టార్లు ఉందని అందులో 13 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ వేశారన్నారు. జూలై15 వరకు వేరుశనగ సాగు చేసుకునేందుకు గడువుందన్నారు. మడకశిర మండంలంలో 3,542హెక్టార్లు, అమరాపురం మండలంలో 3,550హెక్టార్లు, గుడిబండ మండలంలో 3,800 హెక్టార్లు, రొళ్ల మండలంలో 1743హెక్టార్లు, అగళి మండలంలో 315 హెక్టార్ల రైతులు వేరుశనగ పంటను సాగు చేశారన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు.

అప్పులు చేసి సాగుకు సిద్ధమయ్యాం: నరసప్ప, రైతు, కాలువేపల్లి



వేరుశన సాగుకు అప్పులు చేసి సర్వం సిద్ధం చేసుకున్నా వాన జాడలేకుండా పోయింది. రెండు ఎకరాల పొలంలో గత యేడు వేరుశన సాగు చేసి తీవ్రంగా నష్ట పోయాం. ఈ యేడు ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడడంతో దుక్కులు దున్నుకున్నాం. 20 రోజులు నుంచి వర్షం కోసం ఎదురు చూస్తున్నా చినుకు రాలడం లేదు. రూ.20వేలకు పైగా ఖర్చయింది. వారంలోగా కురవకపోతే ఆశలు వదులుకోవాల్సిందే.

అభివృద్ధికి నోచుకోని ఎమ్మెల్యే స్వగ్రామం



← మరదాసనహళ్లిలో బురదమయమైన రహదారి

పావగడ, జూలై 9: పావగడ ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ సొంత గ్రామమైన మరదాసనహళ్లి పంచాయతీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేటికీ అక్కడ మట్టి ఇళ్లు, పెంకుల ఇళ్లు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే గుంతల రోడ్లపై బురద చేరి ఇబ్బంది పడుతున్నామని కెంచప్ప ఆరోపించారు. ఎస్‌సీపీ సీఎస్‌పీ నిధుల కింద సీసీ రోడ్ల నిర్మాణం దళిత కాలనీ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్న తరుణంలో ఎమ్మెల్యే సొంత పంచాయతీలోనే ఇలాంటి దారుణమైన పరిస్థితిని చూడటం ఎంతో విడ్డూరంగా ఉందని వారు వాపోయారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినా గ్రామాల అభివృద్ధి మాత్రం శూన్యమని ఆందోళన చెందారు. దోమల బెడద కారణంగా డెంగీ తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఇప్పటికైనా ఎమ్మెల్యే గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన

లేపాక్షి, జూలై 9 : స్థానిక జవహర్ నవోదయ విశ్వ విద్యాలయంలో మంగళవారం పూర్వ విద్యార్థి గవ్వల విష్ణుతేజ్ రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ గవ్వల విష్ణుతేజ్ గతంలో నవోదయ పాఠశాలలో చదువుతుండేవాడని ప్రస్తుతం యుఎస్‌ఎలో ఫాసిల్‌రిడ్జ్ హైస్కూల్‌లో చదువుతున్నాడన్నారు. సెలవుల నిమిత్తం స్వగ్రామం నార్పలకు వచ్చిన అతను పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రోబోటిక్స్ అండ్ స్టెప్ ప్రెజెంటేషన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

అగళి, జూలై 9 : అగళి మండల రైతులు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చిన్న, సన్న కారు రైతులు డ్రైల్యాండ్ కింద పండ్లతోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ శివన్న తెలిపారు. రైతులు జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కొత్తగా వన్‌బీ నంబరు, చిన్న, సన్నకారు రైతుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకంపై కనబరిచిన పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలోని ఉపాధి సిబ్బందికి అందజేయాలని ఏపీఓ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర టౌన్, జూలై 9: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడీయాప్ సంస్థలు సంయుక్తంగా ఉచిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, బ్యూటీషియన్, టైలరింగ్ తదితర కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ వారు కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సులో 4 నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. కోర్సుపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కోసం కో ఆర్డి నేటర్ సాయిగణేష్ సెల్ నెంబర్:7989923515కు సంప్రదించవచ్చాన్నారు.

వివాహిత ఆత్మహత్యయత్నం

గోరంట్ల, జూలై 9: మండలంలోని భూగానిపల్లికి చెందిన వివాహిత మమత కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందు తాగి మంగళవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. భూగానిపల్లికి చెందిన శంకర్ భార్య మమత కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఇంట్లో గొర్రెలకు ఉపయోగించే మందును తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలుచేసి, మెగురైన వైద్యం కోసం 108 హిందూపురం తరలించారు.

12న మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ, జూలై 9: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బంగారమ్మ, ఏఓ నారాయణప్ప తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు మంత్రి సవిత రాక

పెనుకొండ టౌన్, జూలై 9: బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత జిల్లాకు రానున్నట్లు మంగళవారం ఐఎన్‌టీఆర్ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి విజయవాడలో బయలుదేరి బుధవారం 8గంటలకు పెనుకొండకు రానున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

గుడిబండ, జూలై 9 : మండలంలో విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న విశ్వనాథ్ బదిలీ అయ్యారు. నూతన ఏఈని నియమించలేదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఏఈ ప్రవర్తన సరిగా లేకపోవడంతో బదిలీ చేసినట్లు సమాచారం.

గ్రామీణులను ఆర్థికంగా బలపరచడమే లక్ష్యం

● టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకుడు బబ్లూగంగూలీ

పెనుకొండ రూరల్(రొద్దం), జూలై 9 : గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఆర్థికంగా మెరుగుపరిచేందుకే టింబక్టు కలెక్టివ్ సంస్థ పనిచేస్తుందని వ్యవస్థాపకుడు బబ్లూగంగూలీ పేర్కొన్నారు. మంగళవారం రొద్దం మండలం చెరుకూరు గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో చెరువులో పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో సమావేశమైన బబ్లూ గంగూలి మాట్లాడుతూ.. సంస్థ 34సంవత్సరాల నుంచి మహిళలు, దివ్యాంగులు, రైతులు, పిల్లలు, పర్యావరణం, కూలీలు, కళాకారుల అభ్యున్నతి కోసం పనిచేస్తోందన్నారు. గ్రామ ఉమ్మడి వనరులైన నీటి వనరులు, మరమ్మతులు, చెరువుల పూడికతీత పనులు ప్రారంభించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రొద్దం, రామగిరి, చెన్నెకొత్తపల్లి మండలాల్లో 12పంచాయతీల్లో 16గ్రామాల్లో రాయలసీమ వాటర్‌ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వాటర్‌ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, సంస్థ మేనేజర్ మహేష్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవి, సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ వెంకటేశులు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గుడిబండ, జూలై 9 : మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన మహాలింగప్ప తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అదే మండలం రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న గోవిందప్పకు దొరకగా అది మడకశిర ఎస్ఐ బ్రహ్మానందరెడ్డికి అప్పగించారు. కాల్స్ ఆధారంగా మహాలింగప్పకు మొబైల్ అప్పగించారు. గోవిందప్పను పలువురు ప్రశంసించారు.

నకిలీ పత్రాలతో భూమిని కాజేశారు..

హిందూపురం, జూలై 9: తప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని ఆక్రమించారంటూ రమేష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నంజప్పలు వాపోయారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 405-2సీలో ప్లాట్లు కొనుగోలు చేశామని కొంతమంది చెప్పుకుంటున్నారు. ఇదే విషయాన్ని సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కానీ వారుచెప్పినట్లు ఆ భూమివారిది కాదని కస్తూరీ అనే మహిళ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే ఆ కస్తూరీకి ఈ భూమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అయితే చదువురాదని అమాయకంగా ఉండటంతో తమ భూమిని కబ్జాచేసి ప్లాట్లుగా విక్రయించారని తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అంతేకాక డైక్లాయిడ్‌లో తమ పూర్వీకుల పేర్లున్నాయి. అదే పేర్లతో పత్రాలు సృష్టించి కొనుగోలు చేశారని వారు ఆరోపించారు.

పురం ఫార్మసీ విద్యార్థికి జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఫాతిమా

హిందూపురం అర్బన్, జూలై 9: హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎస్ ఫాతిమా జోహ్రా డిప్లొమా ఇన్ ఫార్మసీ విభాగంలో దేశ స్థాయిలో ద్వితీయ అవార్డు సాధించింది. ఈ నెల 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన కేకే ఆచార్య అవార్డుల ప్రదానోత్సవానికి ఫాతిమాను ఆహ్వానించినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. ఇండియన్ హాస్పెటల్ ఫార్మసిస్ట్ అసోసియేషన్, న్యూఢిల్లీ వారు ఏటా ఈ అవార్డులను అందజేస్తారు. దేశస్థాయిలో డిప్లొమో ఇన్ ఫార్మసిస్ట్ విభాగంలో పాతిమా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 96.14 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. 2023 సంవత్సరానికి గాను కేకే అవార్డుతో పాటు రూ.5 వేలు నగదు బహుమతి, జ్ఞాపికను అందించారన్నారు. హైదరాబాద్‌లో తెలంగాన ఉపముఖ్యమంతి బట్టి విక్రమార్క చేతుల మీదుగా పాతిమా ఈ అవార్డును అందుకుంది. ప్రస్తుతం ఈ విద్యార్థిని అనంతపురంలో బి. ఫార్మసీ చేస్తుంది. విద్యార్థిని ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం అభినందించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

పావగడ, జూలై 9 : వర్షాకాలం రావడంతో అనేక అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటిని అరికట్టడానికి ఆరోగ్యశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. మంగళవారం జరిగిన కేడీపీ సభలో తాలూకా స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా డెంగీ జ్వరాలు అధికమవుతున్నాయని వాటితోపాటు మలేరియా, విషజ్వరాలు దోమల నుంచి వ్యాపిస్తున్నాయన్నారు. అధికారులు పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీడీఓలు తుంగభద్ర నీరు అందే వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓ జానకిరాం, తహసీల్దార్ వరదరాజు, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.